• ఇఫ్తార్ విందులో కేటీఆర్

ప్రముఖ వ్యాపారవేత్త సర్ఫరాజ్‌ఖాన్ హైదరాబాద్ బంజారాహిల్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ హాజరయ్యారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు విప్లవ్‌కుమార్, మన్నె గోవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

# 9 చానళ్లకు కేటీఆర్ లీగల్ నోటీసులు

- పక్కా ప్రణాళికతో దుష్ప్రచారం
- మీడియా ముసుగులో కుట్రలు
- మాకు సంబంధం లేని అంశాల్లో మా పేరు, ఫొటోలు వాడుతున్నాయి
- చట్ట ప్రకారం శిక్ష ఎదుర్కోక తప్పదు
- పరువు నష్టం కేసులూ తప్పవు
- యూట్యూబ్‌కూ నోటీసులు: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): కొన్ని టీవీ, సోషల్ మీడియా చానళ్లకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు లీగల్ నోటీసులు పంపారు. తనను, తన కుటుంబాన్ని బద్నాం చేయాలన్న కుట్రలో భాగంగా అసత్య ప్రచారాలు, కట్టుకథలను ప్రచారం చేస్తున్నాయని పేర్కొంటూ 9 టీవీ, సోషల్ మీడియా చానళ్లకు నోటీసులు పంపారు. 'పక్కా ప్రణాళిక ప్రచారం దుష్ప్రచారం చేస్తున్నాయి. ఇవన్నీ ఒక పక్కా ఎజెండాలో భాగమే. మీడియ ముసుగులో ఈ కుట్రలు చేస్తున్నాయి. మాకు సంబంధమే లేని అనేక అంశాల్లో మా పేరును, ఫొటోను వాడుతూ, అత్యంత హీనమైన తంబ్‌నెయిల్స్ పెడుతూ పబ్బం గడుపుతున్న చానళ్లపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటున్నా. వీరందరు చట్టప్రకారం శిక్ష ఎదుర్కొనక తప్పదు. ఇప్పటికైనా సంబంధం లేని అంశాల్లో తమపై దుర్మార్గపూరిత ప్రచారం చేస్తూ, పెట్టిన వీడియోలను వెంటనే తొలగించాలి' అని లీగల్ నోటీసులో పేర్కొన్నారు. అసత్యపూరిత అంశాలను వెంటనే తొలగించకుంటే మరిన్ని చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొన్ని మీడియా సంస్థలు, యూట్యూబ్ చానళ్లు ఇప్పటికే తమ తప్పును సరిదిద్దుకొని, వీడియోలు, కంటెంట్‌ను తొలగించాయని వెల్లడించారు. వారంలోగా మిగిలిన మీడియా చానళ్లు, యూట్యూబ్ చానళ్లు ఇలాంటి కంటెంట్ తీసివేయకుంటే మరిన్ని న్యాయపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. తమకు, తమ పార్టీకి సంబంధం లేని అంశాలపై అడ్డగోలు ప్రచారం, అసత్య ప్రచారం చేసే ప్రతి ఒక్క మీడియా సంస్థ, యూట్యూబ్ చానళ్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, ఈ విషయాన్ని గుర్తించాలని తెల్చిచెప్పారు. కేవలం ఆయా సంస్థలకే కాకుండా నేరుగా యూట్యూబ్‌కు కూడా లీగల్ నోటీసులు పంపించామని పేర్కొన్నారు. తమపై కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న సంస్థలు భవిష్యత్తులోనూ మరిన్ని లీగల్ నోటీసులు, కేసులకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

## కేటీఆర్‌పై బంజారాహిల్స్‌లో కేసు

బంజారాహిల్స్, మార్చి 30: రాష్ట్రంలోని కాంట్రాక్టర్లు, బిల్డర్ల నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.2,500 కోట్లు వసూలు చేసి ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ పెద్దలకు పంపించారంటూ వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇటీవల హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేయడంతో సీఎం ప్రతిష్టకు భంగం వాటిల్లిందని హనుమకొండకు చెందిన కాంగ్రెస్ నేత బత్తిన శ్రీనివాస్‌రావు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన హనుమకొండ పోలీసులు.. ఆ ఎఫ్ఐఆర్‌ను బంజారాహిల్స్ స్టేషన్‌కు పంపారు. దీంతో బంజారాహిల్స్ పోలీసులు శుక్రవారం రాత్రి కేటీఆర్‌పై ఐపీసీలోని 504, 505(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## చెట్టును నరికితే ఉబికి వచ్చిన నీరు

### ఏపీలో అరుదైన ఘటన వెలుగులోకి

హైదరాబాద్, మార్చి 30 (నమస్తేతెలంగాణ) : సాధారణంగా భూమిలో బోరు వేస్తే నీళ్లు ఉబికి వస్తాయి. కానీ చెట్టును నరికితే నీళ్లు వచ్చాయి. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ అరుదైన ఘటన చోటుచేసుకున్నది. పాపికొండల నేషనల్ ఫారెస్ట్ పరిధిలోని కింటుకూరు ప్రాంతంలోని బేస్ క్యాంపు పరిశీలనకు వెళ్లిన అటవీ శాఖ అధికారులు.. అక్కడ నల్లమద్ది చెట్టు నుంచి నీళ్లు చుక్కలు, చుక్కలుగా రావడాన్ని గమనించారు. వెంటనే చెట్టు బెరుడును నరకగా, మొదలు భాగం నుంచి నీళ్లు ఉబికి వచ్చాయి. అలా వచ్చిన జలధార చూసిన అటవీ అధికారులు అవాక్కయ్యారు. చెట్టు నుంచి వచ్చిన నీటిని అధికారులు తాగారు. ఈ చెట్టును జలధార వృక్షంగా వారు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నది. అల్లూరి జిల్లా రంపచోడవరం – కింటుకూరు అటవీ ప్రాంతంలో నల్లమద్ది చెట్లు వేలాదిగా ఉన్నాయి. కొన్నింటిలోనే నీటిని నిలువ చేసుకునే వ్యవస్థ ఉన్నది. నల్లమద్ది చెట్టు 20 లీటర్ల స్వచ్ఛమైన నీటిని నిల్వ చేసుకుంటుంది. గోదావరి పరీవాహక ప్రాంతాల్లోనూ అటవీ ప్రాంతంలో విరివిగా ఈ నల్ల మద్ది చెట్లు ఉన్నాయి. వందల్లో ఒక చెట్టుకు మాత్రమే నీటిని నిల్వ చేసుకునే వ్యవస్థ ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

## కార్పొరేషన్ పదవులు కాగితాలకే పరిమితం

- ఇంకా జీవో రాలేదని మంత్రి పొన్నం స్పష్టం
- ఎప్పుడు వస్తుందన్న దానిపై స్పష్టత శూన్యం

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 37 కార్పొరేషన్ చైర్మన్ల నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను ఇంకా విడుదల చేయలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వచ్చాక 17 కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వాస్తవానికి పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు రోజు కాంగ్రెస్ పార్టీ హడావుడిగా చైర్మన్ పదవుల జాబితాను అనధికారికంగా విడుదలచేసిన విషయం విదితమే. దీంతో ఆ జాబితాలో పేర్లున్న నేతలు తమకు పదవులు వచ్చాయని సంబరపడ్డారు. కానీ, ఆ పదవులు ఇప్పటికీ కాగితాలకే పరిమితమయ్యాయి. దీనిపై విలేకర్లు అడిగిన ప్రశ్నలను మంత్రి పొన్నం దాటవేస్తూ ఇంకా జీవో రాలేదని సెలవిచ్చారు. ఆ జీవో ఎప్పుడు వస్తుందో కూడా స్పష్టత ఇవ్వలేదు. బలహీన వర్గాలకు కాంగ్రెస్ హయాంలోనే న్యాయం జరుగుతుందని, విదేశీ విద్యనభ్యసించే బీసీ విద్యార్థులకు సహాయాన్ని పెంచాలని యోచిస్తున్నామని చెప్పారు. అధికారంలోకి వస్తే బీసీ అభ్యర్థిని సీఎం చేస్తామని ప్రగల్భాలు పలికిన బీజేపీ.. బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని పార్టీ అధ్యక్ష పదవి నుంచి ఎందుకు తొలగించిందని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు విభజన హామీలను నెరవేర్చలేదని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రధాని నరేంద్రమోదీ అవమానించారని మంత్రి పొన్నం ధ్వజమెత్తారు.

## రఘునందన్‌రావుపై చర్యలు తీసుకోండి

### సీఈవోకు చింతా ప్రభాకర్ ఫిర్యాదు

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం బీఆర్కే భవన్‌లో సీఈవో వికాస్‌రాజ్‌ను కలిసిన ఆయన అభ్యంతరకర వ్యాఖ్యలను సంబంధించిన ఆధారాలను అందజేశారు. వ్యక్తిగతంగా దూషిస్తూ, రాయలేని పదాలను ఉపయోగించిన రఘునందన్‌రావుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరుగాలని కోరుకుంటున్నామని, కానీ రఘునందన్‌రావు ఇలా ఇష్టమొచ్చినట్టు మాట్లాడటం తగదని అన్నారు.

### కాంగ్రెస్‌లో చేరిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, మార్చి 30: జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లిన విజయలక్ష్మికి కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. విజయలక్ష్మితోపాటు ఆమె సోదరుడు వెంకటేశ్వరరావు కూడా కాంగ్రెస్‌లో చేరారు.

సీఎం రేవంత్‌రెడ్డి నివాసం ఎదుట ఆత్మహత్యకు యత్నించిన కృష్ణసాగర్

## కాంగ్రెస్‌లో పారాచ్యూట్ నేతలకే ప్రాధాన్యం

- పార్టీ కోసం కష్టపడిన వారిని పట్టించుకోవడం లేదు
- భూపాలపల్లి పట్టణ కాంగ్రెస్ కార్యకర్త ఆవేదన
- సీఎం రేవంత్ నివాసం వద్ద ఆత్మహత్యాయత్నం

భూపాలపల్లి రూరల్/బంజారాహిల్స్, మార్చి 30: కాంగ్రెస్ పార్టీలో పారాచ్యూట్ నేతలకే ప్రాధాన్యం దక్కుతున్నదని, పార్టీ కోసం కష్టపడిన వారిని పట్టించుకోవడం లేదని భూపాలపల్లి పట్టణంలోని ఫకీరుగడ్డకు చెందిన కృష్ణసాగర్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసం ఎదుట శనివారం ఆత్మహత్యకు యత్నించాడు. వివరాల్లోకి వెళ్తే.. కృష్ణసాగర్ తల్లిదండ్రులు చిన్నతనంలో చనిపోగా మాజీ సర్పంచ్ బుర్ర చంద్రయ్య చేరదీసి పెంచి పెద్ద చేశారు. భూపాలపల్లి పట్టణంలో డిగ్రీ వరకు చదువుకున్నాడు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో అప్పటి నుంచి పార్టీ ముఖ్యకార్యకర్తగా పనిచేస్తున్నాడు. అసెంబ్లీ ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డిని అరెస్ట్ చేసినప్పుడు భూపాలపల్లిలోని సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో చురుకుగా పాల్గొన్నాడు. మూడునెలల క్రితం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తనలాంటి కార్యకర్తలను స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ పట్టించుకోవడం లేదని, కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆవేదనలో ఉన్నాడు. ఈ క్రమంలో శనివారం నగరానికి వచ్చిన కృష్ణసాగర్ జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ నివాసం వద్దకు చేరుకున్నాడు. కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి వివరిస్తానని భద్రతా సిబ్బందిని కోరాడు. అయితే అపాయింట్‌మెంట్ లేకుండా లోనికి పంపించలేమంటూ పోలీసులు చెప్పారు. దీంతో తనతోపాటు తెచ్చుకున్న పెట్రోల్ ఒంటిమీద పోసుకున్నాడు. అప్రమత్తమైన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని జూబ్లీహిల్స్ పీఎస్‌కు తరలించారు. కృష్ణసాగర్ మీద కేసు నమోదు చేసిన పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి పంపించారు.

## ఇజ్రాయెల్‌కు మరిన్ని ఆయుధాలు

### 2 వేల బాంబులు అందించిన యూఎస్

న్యూయార్క్, మార్చి 30: ఒకవైపు గాజాపై ఇజ్రాయెల్ దళాలు జరుపుతున్న దాడుల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూనే మరోవైపు ఇజ్రాయెల్‌కు ఆయుధ సరఫరాను కొనసాగిస్తున్నది అమెరికా. తాజాగా కొత్త ఆయుధ ప్యాకేజీలో భాగంగా మిత్రదేశం ఇజ్రాయెల్‌కు అమెరికా రెండు వేలకు పైగా బాంబులు, ఫైటర్ జెట్‌లను సరఫరా చేసినట్టు వార్తలు వస్తున్నాయి. దీంతో పాటు వార్షిక సైనిక సహాయంగా మరో 3.8 బిలియన్ డాలర్లను కూడా అమెరికా అందించిందని తెలుస్తున్నది. అయితే, ఈ వార్తలపై అమెరికా కానీ, ఇజ్రాయెల్ కానీ స్పందించ లేదు. కాగా, ఇజ్రాయెల్‌కు సైనిక సహకారాన్ని నిలిపివేయాలని అధికార డెమాక్రటిక్ పార్టీకి చెందిన కొందరు సభ్యులు అమెరికా అధ్యక్షుడు జోబైడెన్‌ను కోరుతున్నప్పటికీ సైనిక సహకారం కొనసాగుతుండటం గమనార్హం.

CSIR-NATIONAL ENVIRONMENTAL ENGINEERING RESEARCH INSTITUTE (NEERI), HYDERABAD ZONAL CENTRE (HZC)
(An ISO 9001:2008 certified organization)
IICT Campus, Tarnaka, Hyderabad – 500 007
Website : http://www.neeri.res.in

ENGAGEMENT OF PROJECT ASSISTANTS UNDER SPONSORED PROJECTS
ADVERTISEMENT NOs. RECRUIT_V6_6D_HYDERABAD_11032024, RECRUIT_V6_6D_HYDERABAD_12032024_D RECRUIT_V6_6D_HYDERABAD_11032024_B , RECRUIT_V6_6D_HYDERABAD_11032024_C

Applications from eligible & interested candidates are invited via WALK-IN INTERVIEW on April 4, 2024 from 10.30 am onwards at CSIR-NEERI, HZC, IICT campus, Tarnaka, Hyderabad -500007 for engagement of Project Assistant (6 no.s) on purely temporary basis with remuneration of Rs. 20000/- per month plus HRA (as applicable) under various sponsored projects tenable at CSIR-NEERI, Hyderabad Zonal Centre. For essential qualification and job requirement the full advertisement may be seen on the above website of the Institute under the caption "Recruitment".

Project Leader